VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 31 ఆగస్టు 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 65



జనసంద్రంగా యాదగిరి క్షేత్రం.

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## ప్రధాని మోడీకి ఉజ్బెకిస్తాన్ అత్యున్నత పురస్కారం

### 'ఓలి దారాజలి దోస్తిలిక్' అందజేసిన ఆ దేశ అధ్యక్షుడు మిర్జియోయెవ్

తాష్కెంట్: భారత ప్రధాని నరేంద్ర మోదీకి మరో అరుదైన గౌరవం దక్కింది. ఉజ్బెకిస్తాన్ అత్యున్నత పురస్కారం అయిన 'ఓలి దారాజలి దోస్తిలిక్' అవార్డును ప్రధాని మోదీకి అందించింది. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఈ పురస్కారాన్ని మోదీకి ఆదివారం అందజేశారు. మోదీకి దక్కిన 36వ అంతర్జాతీయ పురస్కారం ఇది. ఉజ్బెకిస్తాన్, ఇండియా మధ్య బంధం బలోపేతం కోసం ఈ అవార్డును అంకితమిస్తున్నానని ప్రధాని మోదీ అన్నారు. ఈ అవార్డు దక్కడాన్ని గౌరవంగా భావిస్తున్నానని, రెండు దేశాల మధ్య మైత్రికి ఇది నిదర్శనం అన్నారు. దోస్తిలిక్ అవార్డులోని దోస్త్ అంటే స్నేహం, స్నేహితుడు అని మోదీ గుర్తు చేశారు. భారత ప్రజల తరఫున ఉజ్బెకిస్తాన్‌కు, ఆ దేశ అధ్యక్షుడికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. మోదీ ప్రస్తుతం ఉజ్బెకిస్తాన్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. శని, ఆదివారాల్లో ఆ దేశ రాజదాని తాష్కెంట్‌లో ఆయన పర్యటన సాగుతోంది. మోదీ పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య కీలక ఒప్పందాలు, చర్చలు జరుగుతున్నాయి. ముఖ్యంగా వ్యాపారం, వాణిజ్యం, టెక్నాలజీ వంటి రంగాల్లో సహకారానికి, ద్వైపాక్షిక సంబంధాల పెంపునకు ఈ పర్యటన ఉపయోగపడనుంది. ఇరు దేశాల మధ్య యురేనియం సరఫరాకు సంబంధించిన ఒప్పందం కుదిరింది. మరోవైపు ఇండియాపై ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు ప్రశంసలు మిగతా 2లో..

# కుటుంబ పాలన నుంచి ప్రజా పాలన వైపు..

### కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన ఓ మైలురాయి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్: గత భారాస పాలనలో అధికారం ఒక వ్యక్తి, ఒక కుటుంబం చేతుల్లో కేంద్రీకృతమై ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీనపడ్డాయనీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలనను పునరుద్ధరించామని భారీ నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్లలో మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షాలు, సామాన్య ప్రజల గొంతుకకు విలువ లేకుండా పోయిందనీ.. సచివాలయాన్ని ప్రజలకు అందుబాటులో లేకుండా చేశారని, ప్రశ్నించే వారిని శత్రువులుగా చూశారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.42 కోట్ల మందికి



ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. సంక్షేమానికి ప్రాధాన్యం: 'మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పరిమితి ద రూ.10 లక్షలకు పెంపు వంటి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది.

## పాలిటెక్నిక్ కాలేజీల విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



ముషీరాబాద్,ఆగస్టు 30

పాలిటెక్నిక్ కాలేజీలను మూసివేయడం లేదా ఇతర సంస్థల్లో విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎంకు లేఖ రాసినట్లు విద్యానగర్ లోని బీసీ భవన్ లో ఆదివారం మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.97ను రద్దు చేయాలని విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.

## 788కి పెరిగిన మృతుల సంఖ్య

- మొత్తంగా 2,500 మందికి పైగా గల్లంతు
- రంగంలోకి భారత రెస్క్యూ బృందాలు..
- కొనసాగుతున్న సహాయక చర్యలు



ఖాట్మండూ: నేపాల్‌లో మృతుల సంఖ్య 788కు చేరింది. మరో 2502 మంది గల్లంతు అయ్యారని ఆ దేశ అధికారులు స్పష్టం చేస్తున్నారు. వీరిలో 933 మంది హైడ్రోపవర్ (జలవిద్యుత్) ప్రాజెక్టు కార్మికులు కాగా, 592 మంది విదేశీయులు, 127 మంది విదేశీ గ్రూపులతో కలిసి ప్రయాణిస్తున్న నేపాల్ పౌరులని మిగతా 2లో..

# 1,000 రోజుల ప్రజాపాలనపై సర్కారు ప్రగతి నివేదిక

సమంగా సంక్షేమం, అభివృద్ధి

సామాజిక న్యాయానికి పెద్దపీట

రైతులు, మహిళలు, యువతకు భరోసా

2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం

*'2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి వలయాలతో హైదరాబాద్ నుంచి గ్రామీణ తెలంగాణ వరకు సమగ్ర అభివృద్ధి దిశగా కార్యాచరణను అమలుచేస్తున్నాం' అని నివేదికలో స్పష్టంచేసింది. అంశాలవారీగా ప్రగతిని ప్రస్తావించింది.*



## నీట్ పీజీ ప్రశాంతం

- దేశవ్యాప్తంగా 1,300 కేంద్రాలు, రాష్ట్రంలో 56 కేంద్రాల్లో పరీక్ష రాసిన విద్యార్థులు
- రంగారెడ్డి జిల్లా శేరిగూడలో మద్యం తాగి పరీక్ష రాసేందుకు వచ్చిన ఓ విద్యార్థి
- గుర్తించిన వెనక్కి పంపిన అధికారులు
- గచ్చిబౌలి-రాయదుర్గం మార్గంలో ట్రాఫిక్ జాంలో చిక్కుకున్న మరో విద్యార్థి
- గ్రీన్ ఛానల్ ద్వారా సకాలంలో పరీక్షా కేంద్రానికి చేర్చిన పోలీసులు
- రాజస్థాన్‌లో పరీక్షకు విద్యుత్ అంతరాయం

హైదరాబాద్, ఆగస్టు 30

నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా సుమారు 2.73 లక్షలకు పైగా అభ్యర్థులు వైద్య ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. 1,300 కేంద్రాల్లో ఎగ్జామ్ నిర్వహించారు. తెలంగాణలో 17,627 మంది దరఖాస్తు చేసుకోగా, 56 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరకుండా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిగూడలో ఓ విద్యార్థి మద్యం తాగి పరీక్ష రాసేందుకు వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న అతడిని



## హైదరాబాద్‌ను లూటీ చేస్తున్న రేవంత్ సర్కారు

జీడిమెట్ల: హైదరాబాద్ మహానగరాన్ని రేవంత్ సర్కారు లూటీ చేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. ఆదివారం జీడిమెట్ల పారిశ్రామిక వాడలో భాజపా మేడ్చల్ అర్బన్ జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం, అధ్యక్షుడిగా నియమితులైన గిరివర్ధన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న 'కోర్ అర్బన్ రీజియన్' (క్యూర్) చట్టాన్ని అమలు చేస్తే కార్పొరేషన్‌ల మేయర్‌లు, కార్పొరేటర్ల వ్యవస్థకు విలువలేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.



## దేశాన్ని మాదకద్రవ్య విముక్తం చేద్దాం

### 'మన్‌కీ బాత్'లో ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

దిల్లీ: మాదక ద్రవ్యాల వ్యసనాన్ని నిర్మూలించేందుకు పౌరులందరూ సమైక్యం కావాలని, యువతకు మేలైన భవితవ్యాన్ని నిర్మించాలని ప్రధాని మోదీ ఆదివారం పిలుపునిచ్చారు. మత్తుపదార్థాల వ్యసనం ఒక వ్యక్తినే కాక యావత్ సమాజాన్ని నాశనం చేస్తుందని 'మన్‌కీ బాత్' రేడియో ప్రసంగంలో ఆయన పేర్కొన్నారు. 'అభివృద్ధి చెందిన భారత్ కోసం మాదక ద్రవ్య విముక్తమైన యువత' నినాదంతో తమ ప్రభుత్వం చేపట్టిన ప్రచారం దేశవ్యాప్తంగా ఊపందుకుందని తెలిపారు. 'భారత యువత ఆరోగ్యం, ఆనందం, ఉజ్వల భవితవ్యం కోసం ఇది మనందరి సమష్టి సంకల్పం. యువతను మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉంచేందుకు, వ్యసనాల నుంచి రక్షించేందుకు ఉద్దేశించిన ఈ సమున్నత క్రతువులో మనందరం సముచిత పాత్ర పోషిద్దాం' అని మోదీ పేర్కొన్నారు.



వేగుచుక్క

## ప్రధాని మోడీకి ఉజ్బెకిస్తాన్ అత్యున్నత పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

కురిపించారు. మోదీ నేతృత్వంలో ఇండియా అభివృద్ధి చెందుతోందని, రెండు దేశాల మధ్య సంబంధాలు బలపడుతున్నాయని అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ అన్నారు. ఈ పర్యటన ముగిసిన తర్వాత మోదీ కిర్గిస్తాన్ వెళ్తారు. అక్కడ సెప్టెంబర్ 1 వరకు జరిగే ఎస్‌సీవో సదస్సులో మోదీ పాల్గొంటారు. అక్కడ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశం ఉంది.

## ప్రైవేటు ఆస్పత్రి నర్సు దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

లోపలికి వెళ్లి చూడగా ఆమె విగతజీవిగా కనిపించింది. ఆమె ముఖం, కాళ్లపై గాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలిది నిరుపేద కుటుంబం. అంకంపాలెంలోని ట్రైబల్ గురుకుల పాఠశాలలో పదోతరగతి వరకు చదివిన ఆమె.. భద్రాచలం గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసింది. అనంతరం హైదరాబాద్‌లో నర్సింగ్‌లో శిక్షణ తీసుకుంది. ఆమె తండ్రి కొన్నాళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా.. తల్లి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ వచ్చింది. మృతురాలికి ఒక సోదరుడు ఉన్నాడు. రెండు నెలల క్రితమే వివాహం చేసుకున్న అతడు కూడా గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కుటుంబానికి అండగా ఉండేందుకు ఉద్యోగంలో చేరిన ఆమె.. ఓ మానవ మృగం చేతిలో బలికావటంతో ఆ గ్రామస్తులు షాక్‌కు గురయ్యారు. మృతురాలి అంత్యక్రియలు సోమవారం స్వగ్రామంలో జరగనున్నాయి.

## చిత్రకూట్‌లో జల విలయం

2 దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత వరద

భోపాల్, ఆగస్టు 30: మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. మందాకినీ నది ప్రమాదకర స్థాయిని మించి 13 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. దీంతో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని ఇళ్లు, హోటళ్లు, భవనాలు, ఆలయాలు నీటమునిగాయి. ప్రజలు ఎత్తైన భవనాలపైకి ఎక్కి సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. నయాగావ్‌లోని రామ్‌ఘాట్, హనుమాన్ ధారాలను కలిపే 300 మీటర్ల పొడవైన వంతెనలోని కొంత భాగం కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు స్థంభించిపోయాయి. వరదల కారణంగా రైతులకు భారీ నష్టం వాటిల్లింది. అధికారులు సుమారు వెయ్యిమందిని కాపాడి సహాయ శిబిరాలకు తరలించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భారత వైమానిక దళం హెలికాప్టర్ల సాయంతో బాధితులను రక్షించింది. కుండపోత కొనసాగుతుందన్న హెచ్చరికలతో అధికారులు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.

## ప్రశ్నించిన విద్యార్థులను శిక్షించడం సరికాదు


- అలాంటి చర్యలు రాజ్యాంగానికి శోభను ఇవ్వవు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ వ్యాఖ్యలు
- న్యాయకోవిదులను జడ్జీలుగా నియమించాలని సూచన

న్యూఢిల్లీ: భిన్నాభిప్రాయాలను కలిగిన విద్యార్థులను ప్రశ్నించారనే కారణంగా శిక్షించడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అన్నారు. స్థిరపడిపోయిన విషయాలతో విభేదించడానికి, ప్రశ్నించడానికి తగిన వేదికగా యూనివర్సిటీలు ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు స్వేచ్ఛగా ఆలోచించడం యూనివర్సిటీ స్థాయిలోనే ప్రారంభిస్తారని తెలిపారు. ఢిల్లీలో జరిగిన నేషనల్ లా యూనివర్సిటీ పీజీ విద్యార్థుల 13వ స్నాతకోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. భిన్న దృక్పథాలు, విశ్వాసాలు కలిగిన స్వేచ్ఛా సమాజ నిర్మాణం రాజ్యాంగం లక్ష్యమని, ప్రజా జీవనంలో అసమ్మతికి చోటు ఉన్నప్పుడే అది సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. రాజ్యాంగ రక్షణను పొందే వాక్, భావ, భిన్నాభిప్రాయ స్వేచ్ఛను అసహన మనస్తత్వం నిరాకరిస్తుందని వివరించారు. ప్రముఖ న్యాయ కోవిదులను గుర్తించి సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని జస్టిస్ భుయాన్ సూచించారు. రాజ్యాంగంలోని 124 (3)(సి) దీనికోసమే ఉద్దేశించినా, గత 70 ఏళ్లుగా ఈ సంప్రదాయానికి దూరం కావడం విచారకరమన్నారు.



## కాలనీ వెల్ఫేర్ సొసైటీ "అధ్యక్షుడిగా వినోద్ కుమార్".

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్:





జిల్లా కేంద్రంలోనీ ఈస్ట్ బ్యాంక్ కాలనీ (పాంగ్రా) వెల్ఫేర్ సొసైటీకి ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి కి ఎన్నిక జరుగగా అధ్యక్షుడిగా వినోద్ కుమార్ , ప్రధాన కార్యదర్శిగా రేగుంట గణేష్ , కోశాధికారిగా రాజయ్య ను భారీ మెజార్టీతో గెలిపించారు.ఎన్నికలు సజావుగా జరగడానికి సహకరించిన ఓటర్లకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారికి కాలనీవాసులు, సభ్యులు హార్దిక శుభాభినందనలు తెలియజేశారు.

## 44 ఏళ్ల వయసులో 42.19 కి.మీ. ఫుల్ మారథాన్.

- నిజామాబాద్ ట్రాన్స్కో విజిలెన్స్ ఎస్ఐ సుధాకర్ అరుదైన ఘనత.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్:





విజిలెన్స్ విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ దాస 44 ఏళ్ల వయసులో ఆదివారం నిర్వహించిన ఎన్ ఎం డీసీ రన్ లో పాల్గొని 42.19 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. విధి నిర్వహణతో పాటు శారీరక దారుఢ్యం, ఆరోగ్యం మరియు క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తూ శ్రీ సుధాకర్ దాస రన్నింగ్‌ను తన జీవనశైలిలో భాగంగా చేసుకున్నారు. గతంలో హాఫ్ మారథాన్‌లలో కూడా పాల్గొని విజయవంతంగా పూర్తి చేసిన ఆయన, ఈసారి పూర్తి మారథాన్‌లో పాల్గొని 42.19 కి.మీ. లక్ష్యాన్ని చేరుకున్నారు.మారథాన్‌లో చివరి దశలో శారీరక అలసట ఎదురైనప్పటికీ, పట్టుదలతో ముందుకు సాగి ఫినిషింగ్ లైన్‌ను చేరుకున్నారు. 44 సంవత్సరాల వయసులో 42.19 కి.మీ. పూర్తి చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఆయన తెలిపారు.

**"వయసు మన లక్ష్యాలకు అడ్డంకి కాదు".**

"వయసు మన లక్ష్యాలకు అడ్డంకి కాదు. ఆరోగ్యం, క్రమశిక్షణ, నిరంతర సాధన మరియు పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టి వ్యాయామం, రన్నింగ్ వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను జీవనశైలిలో భాగం చేసుకోవాలి" అని సుధాకర్ దాస తెలిపారు. పోలీసు విధులతో పాటు ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇస్తూ, యువతకు మరియు సమాజానికి ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమశిక్షణ, పట్టుదలపైలి స్ఫూర్తినివ్వాలనే ఉద్దేశంతో తాను రన్నింగ్‌ను కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ప్రవాస భారతీయులు కర్మభూమికి విధేయులుగా ఉండాలి

న్యూయార్క్: భారతీయ ప్రవాసులు తాము నివసిస్తున్న దేశానికి విధేయులుగా ఉండాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధిపతి మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. భారత్ వారి జన్మభూమి అయినప్పటికీ, తాము నివసిస్తూ, పనిచేస్తున్న దేశమే కర్మభూమి అని పేర్కొన్నారు. కర్మభూమి పట్ల తమ బాధ్యతలను ముందుగా నెరవేర్చాలని సూచించారు. అలాగే భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ డీఎన్ఏలోనే అంతర్లీనంగా ఉందని ఆయన అన్నారు. న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో శనివారం (స్థానిక కాలమానం ప్రకారం) జరిగిన యూనివర్సల్ వన్నెస్ సెలబ్రేషన్‌లో ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతమైన మానవతా సేవ గురించి కూడా భాగవత్ ప్రస్తావించారు. 1996లో హరియాణాలోని చార్ఖీ దాద్రీ వద్ద జరిగిన విమాన ప్రమాదాన్ని గుర్తుచేసుకున్నారు. రెండు విమానాలు ఢీకొన్న ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని భాగవత్ చెప్పారు. గాయపడిన వారికి చికిత్స అందించడం, మృతదేహాలను వెలికితీయడం, బాధితుల బంధువులకు అంత్య



క్రియల్లో సహకరించడం వంటి సేవలు అందించారని తెలిపారు. ఆ సమయంలో బాధితులు ముస్లింలా, ఇతర మతాలకు చెందినవారా అని తమ స్వయంసేవకులు ఆలోచించలేదని భాగవత్ అన్నారు. మానవత్వంతో స్పందించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. అలాగే భారత్‌లో ముస్లింలు ఉండకూడదని భావించే వ్యక్తి హిందువుగా ఉండలేడని మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. భారత్ నుంచి ముస్లింలను వెళ్లగొట్టాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటుందా అని గతంలో కొందరు తనను ప్రశ్నించారని గుర్తుచేశారు. సంస్థపై ఉన్న అపోహలను ఉద్దేశించి భాగవత్ మాట్లాడుతూ, తప్పుడు కథనాల వల్ల ఎన్నో అభిప్రాయాలు ఏర్పడ్డాయని అన్నారు. కానీ ఇతరులు వచ్చి ఆర్ఎస్ఎస్‌ను లోపలి నుంచి చూసినప్పుడే, అవి తప్పులని తేలతాయని అన్నారు. ముస్లింలు లేని భారత్‌ను కోరుకోవడం హిందుత్వం కాదు అని తాను వారికి సమాధానం ఇచ్చినట్లు భాగవత్ తెలిపారు. నేను, నాది అనే ఆలోచనలతో సమస్యలకు పరిష్కారం లభించదని, మనం, మనది అనే భావనతోనే ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. విస్తృత ప్రపంచ, సామాజిక కార్యాచరణకు ఒక మార్గసూచిని వివరిస్తూ, ప్రజల చైతన్యాన్ని మార్చడం ద్వారానే నిజమైన మార్పు వస్తుందని, అదే అంతిమంగా రాజకీయ సంకల్పాన్ని రూపుదిద్దుతుందని భాగవత్ చెప్పారు. నేటి రాజకీయాలు, ముఖ్యంగా ప్రజాస్వామ్యంలో, ప్రజాభిప్రాయంపై ఆధారపడి ఉంటాయని అన్నారు. ప్రజాభిప్రాయం ఉంటే, ఏ రాజకీయ నాయకుడు దానికి వ్యతిరేకంగా వెళ్లడానికి సాహసించడని చెప్పారు. అందువల్ల నేడు ఉమ్మడి అందరు కలిసి సంకల్పం తీసుకున్న తర్వాత, ఈ సమాజాల్లో చర్యలు తీసుకోవాలని, అలాగే అందరూ మొదట స్థానికంగా చర్యలు తీసుకోవాలని భాగవత్ భావిస్తునట్లు తెలిపారు.

# నేడే మూసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జి ప్రారంభం

- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మూసీకి 1.5లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకునేలా బ్రిడ్జి నిర్మాణం

చాదర్‌ఘాట్, ఆగస్టు 30

మూసారాంబాగ్–అంబర్‌పేట ప్రాంతాలను కలుపుతూ మూసీ నదిపై రూ.52 కోట్ల వ్యయంతో నిర్మించిన మూసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జిని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం ప్రారంభించనున్నారు. ఇందుకోసం జీహెచ్ఎంసీ అధికారిక యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ శనివారం బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆదివారం ఉదయం నుంచే ఫినిషింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయిస్తున్నారు. హైలెవల్ బ్రిడ్జిని రెండు భాగాలుగా నిర్మిస్తున్నారు. ఇందులో మూసారాంబాగ్ వద్ద ఎడమ వైపు వంతెన(డౌన్ స్ట్రీమ్) నిర్మాణం పూర్తైంది. ఈ బ్రిడ్జిపై పాదాచారులు నడిచేందుకు వీలుగా 3.5 మీటర్ల వెడల్పులో ఫుట్‌పాత్‌ను కూడా నిర్మిస్తున్నారు. అప్రోచ్ రోడ్డు, వీధి దీపాల ఏర్పాటు పనులు దాదాపుగా పూర్తయ్యాయి. బ్రిడ్జి కుడివైపు నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. కుడివైపు బ్రిడ్జిని వచ్చే ఏడాది నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈలోగా వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ఎడమవైపు బ్రిడ్జిపై నుంచి రాకపోకలను అనుమతించనున్నారు. మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై ఇంతవరకు ఉన్న లో లెవల్ బ్రిడ్జికి 10మీటర్ల ఎత్తు(32అడుగుల)లో ఈ కొత్త హై లెవల్ బ్రిడ్జిని నిర్మించారు. జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల నుంచి 1.5లక్షల




క్యూసెక్కుల నీటిని విడుదల చేసినా కొత్తగా నిర్మించిన ఈ బ్రిడ్జి తట్టుకోవడంతో పాటు ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం ఉండబోదని ఇంజనీరింగ్ అధికారులు వివరిస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. కాగా, బ్రిడ్జి ప్రారంభోత్సవం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి అంబర్‌పేట జీహెచ్ఎంసీ మైదానంలో బహిరంగ సభలో పాల్గొననున్నారు. మూసీకి వరద వచ్చినప్పుడల్లా మూసారాంబాగ్ లో లెవల్ బ్రిడ్జి మునిగిపోయేది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయేవి. ఈ సమస్యను పరిష్కరించడానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హై లెవల్ బ్రిడ్జిని ప్రతిపాదించింది. 2023 సెప్టెంబరు 24న శంకుస్థాపన చేశారు. తర్వాత ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులు ఆలస్యం అయ్యాయి. 2024, 2025 సంవత్సరాల్లో మూసీ వరద ప్రవాహానికి నిర్మాణంలో ఉన్న మూసారాంబాగ్ బ్రిడ్జి పనులకు కొంత ఆటంకం కలిగింది.




## తెలంగాణలో 40 రైల్వే స్టేషన్లు అభివృద్ధి

వికారాబాద్, ఆగస్టు 30

రాష్ట్రంలో రైల్వే మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మొత్తం 40 రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలతో పునర్‌అభివృద్ధి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా వికారాబాద్, తాండూ రు, నాంపల్లి, సికింద్రాబాద్, మౌలాలి, చర్లపల్లి వంటి ప్రధాన రైల్వే స్టేషన్లు సరికొత్త హంగులతో సిద్ధమవుతున్నాయని చెప్పారు. ఆదివారం వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో రూ.27 కోట్ల వ్యయంతో జరుగుతున్న ఆధునీకరణ, పునర్నిర్మాణ పనుల పురోగతిని ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డితో కలిసి ఆయన పరి శీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికా రాబాద్ పట్టణం, దాని పరిసర ప్రాంతాల వేగవంతమైన ఎదుగుదలను, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ స్టేషన్‌లో పలు ఆధునిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నా రు. ప్రయాణికుల సౌకర్యార్థం అధునాతన వెయిటింగ్ హాళ్లు, ప్రత్యేక లాంజ్ సదుపాయాలు కలిస్తున్నట్లు తెలిపారు. వాహ నాల రాకపోకలకు అనువుగా ఆధునిక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో తెలంగాణ రైల్వే రంగానికి రూ.వేల కోట్ల కేటాయింపులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. తెలంగాణలోని రైల్వే లైన్ల మార్గాల విద్యుదీకరణ ప్రక్రియ పూర్తి అయిందన్నారు. రైళ్ల రాకపోకల వేగాన్ని పెంచేందుకు డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్ర ప్లింగ్ (నాలుగు లైన్ల విస్తరణ) పనులు వేగవంతంగా జరుగు తున్నాయన్నరు. రైలు ప్రమాదాల నివారణకు స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన అత్యంత సురక్షితమైన కవచ్, కవచ్ 2.0 రక్షణ వ్యవస్థలను తెలంగాణలో తొలిసారిగా అమ ల్లోకి తెస్తున్నారని కిషన్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్ కేంద్రంగా ప్రస్తుతం 5 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు సేవలు అందిస్తూ హైస్పీడ్ కనెక్టివిటీని గణనీయంగా పెంచాయన్నారు. కాజీపేటలో ఏర్పాటు చేస్తున్న రైల్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణం ముగింపు దశకు చేరుకుందన్నారు కిషన్ రెడ్డి. అతిత్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ దీనిని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైతే తెలంగాణలో రైల్వే ఉత్పత్తుల తయారీ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుం దని, స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పునరుద్ఘాటించారు. హైదరాబాద్ నగరాన్ని ప్రధాన మెట్రో పాలిటన్ నగరాలైన బెంగళూరు, చెన్నై, పుణేలతో అనుసంధా నించే బుల్లెట్ రైలు సేవలు భవిష్యత్తులో తెలంగాణ రూపురేఖ లను మార్చనున్నాయని కిషన్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామిక వేగవంతమైన వృద్ధి చెందుతుందన్నారు. అంతర్ రాష్ట్ర రవాణా, వాణిజ్య బంధాలు మరింత బలపడతాయన్నారు. రాజధాని హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా తెలంగాణ రైల్వే మౌలిక సదుపాయాల రంగాలు సరికొత్త శిఖరాలకు చేరుకుంటున్నాయని అధికారులు వెల్లడించారు.

## 788కి పెరిగిన మృతుల సంఖ్య

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌డిఆర్‌ఆర్‌ఎంఏ వెల్లడించింది. 20వేల మంది భద్రతా సిబ్బంది భూమార్గం ద్వారా ఇప్పటివరకు మొత్తం 8,730 మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. వైమానిక సిబ్బంది 363 హెలికాప్టర్ ట్రిప్పుల ద్వారా 236 మంది విదేశీయులతో సహా 3,081 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. వరదల్లో చిక్కుకున్న ఒక హైడ్రోపవర్ టన్నెల్ నుంచి 279 మందిని రక్షించారు. మరోవైపు శిథిలాల కింద ఉన్నవారిని రక్షించేందుకు భారత్, చైనా స్పెషల్ రెస్క్యూ బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. కాగా, గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైన మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు, సామూహిక అంత్యక్రియలతో నేపాల్‌లో హృదయవిదారక పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత ప్రాంతాల కోసం నేపాల్ ప్రభుత్వం అత్యవసర నగదు సహాయాన్ని విడుదల చేసింది. ఇందులో భాగంగా రసువా, నువాకోట్ జిల్లాలకు చెరో 10 మిలియన్ల నేపాలీ రూపాయలు, ధాడింగ్‌కు రూ.5 మిలియన్లు, 15 స్థానిక ప్రభుత్వాలకు కలిపి రూ.67.5 మిలియన్ల చొప్పున కేటాయించింది. టిబెట్‌లోని క్యిరాంగ్ కౌంటీలో 16 మంది మరణించగా 546మంది జాడ గల్లంతైంది. ఆకస్మిక వరదల ధాటికి రసువాలోని అప్పర్ త్రిశూలీ హైడ్రోపవర్ ప్రాజెక్ట్ టన్నెల్ బురదతో నిండిపోవడంతో, 100 మందికి పైగా కార్మికులు చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్, సర్వైవర్ డిటెక్షన్, డీఎన్ఏ పరీక్షల కోసం నేపాల్ చేసిన విజ్ఞప్తి మేరకు భారత్ ప్రత్యేక నిపుణుల బృందాన్ని పంపించింది. టిబెట్‌లో వరద కారణంగా ఏర్పడిన బారియర్ సరస్సు ముప్పు తగ్గినట్లు చైనా నిపుణులు చెప్పడం పెద్ద ఉపశమనం కలిగించింది. ఆ సరస్సులోని నీటిమట్టం క్రమంగా తగ్గుతోందని స్పష్టమైనప్పటికీ, ఆ నీరు పూర్తిగా దిగువకు చేరేవరకు ప్రమాదం పొంచే ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. దేశాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు దాదాపు 5 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.40 వేల కోట్లు అవసరమవుతాయని నేపాల్ ప్రభుత్వం అంచనా వేసింది.

## నీట్ పీజీ ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది గుర్తించి వెనక్కి పంపారు.గచ్చిబౌలి ట్రాఫిక్‌లో చిక్కుకున్న నీట్ పిజి విద్యార్థి వికాస్‌ను రాయదుర్గం పోలీసులు నిమిషాల్లో ఎగ్జామ్ సెంటర్‌కు చేర్చారు. ఉదయం మారథాన్ రన్‌లో భాగంగా గచ్చిబౌలి – రాయదుర్గం మార్గంలో ట్రాఫిక్ జాం ఏర్పడింది. వికాస్ ట్రాఫిక్ చిక్కుకుపోవడంతో సైబరాబాద్ పోలీసులు ఆయన కోసం గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. మారథాన్ ట్రాఫిక్‌ను దాటుకుంటూ రాయదుర్గం పోలీసులు గ్రీన్ ఛానెల్ ద్వారా వికాస్‌ను ఎగ్జామ్ సెంటర్ వద్దకు చేర్చారు. గచ్చిబౌలి – రాయదుర్గం మార్గంలో మారథాన్ రన్ ఉన్నందున ట్రాఫిక్ ఉంటుందని సైబరాబాద్ పోలీసులు ముందుగానే ఊహించారు. ఎవరైనా ట్రాఫిక్‌లో చిక్కుకుపోతే కాల్ చేసేందుకు నెంబర్ కూడా ఏర్పాటు చేశారు.

### రాజస్థాన్‌లో పరీక్షకు విద్యుత్ అంతరాయం

అయితే, రాజస్థాన్‌లోని జైపూర్‌లో 2 పరీక్ష కేంద్రాల్లో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు. విద్యుత్ అంతరాయంతో పరీక్షలు సజావుగా జరగలేదని, తిరిగి సెప్టెంబర్ 5న పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 గంటలకు రీ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. పరీక్షా కేంద్రం, సవరించిన అడ్మిట్ కార్డులతో సహా తదుపరి వివరాలు విడిగా తెలియజేస్తామని ప్రకటించాయి. రీ షెడ్యూల్ చేసిన పరీక్ష కేంద్రాల్లో దాదాపు 300 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. తమిళనాడు, ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్ సహా పలు నగరాల్లోని విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

# విజృంభించిన భారత బౌలర్లు

## ఆసియాకప్‌లో శుభారంభం
## థాయ్‌లాండ్‌పై ఘనవిజయం

మహిళల ఆసియాకప్‌లో భారత్‌కు అదిరే ఆరంభం. ఆదివారం అత్యంత ఏకపక్షంగా సాగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 94 పరుగుల తేడాతో థాయ్‌లాండ్‌పై ఘనవిజయం సాధించింది. షెఫాలి వర్మ (64; 36 బంతుల్లో 8ఐ4, 3ఐ6) మెరుపులతో మొదట భారత్ 9 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. మిగతా బ్యాటర్ల వైఫల్యం కారణంగా భారత్ తక్కువ స్కోరుతో సరిపెట్టుకుంది. థాయ్ స్పిన్నర్లు లవోమి (3/26), సునిద (2/31) రాణించారు. లక్ష్య ఛేదనలో థాయ్‌లాండ్ తేలిపోయింది. దీప్తి 1.1 ఓవర్లలో ఒక్క పరుగూ ఇవ్వకుండా 3 వికెట్లు తీయగా.. నందని (3/18), శ్రీచరణి (2/10) కూడా విజృంభించడంతో థాయ్ జట్టు 16.1 ఓవర్లలో 65 పరుగులకే కుప్పకూలింది. ననపత్ (41; 48 బంతుల్లో 5x4) టాప్ స్కోరర్. ఆమె తప్ప ఇంకెవరూ రెండంకెల స్కోరు చేయకపోవడం గమనార్హం. ఈ మ్యాచ్‌తో ప్రతీక రావల్ టీ20 అరంగేట్రం చేసింది. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో సెప్టెంబరు 3న హాంకాంగ్‌తో తలపడుతుంది.





షెఫాలి మెరిసినా..: పసికూనపై భారత్ పరుగుల వరద పారిస్తుందని అంతా అనుకున్నారు. కానీ ఆ జట్టు అనూహ్యంగా 159 పరుగులే చేసింది. బ్యాటుతో ఘోరంగా విఫలమైనప్పటికీ బంతితో భారత్‌ను కట్టడి చేయడం థాయ్‌లాండ్‌కు సంతోషాన్నిచ్చే విషయమే. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. షెఫాలి మెరుపులతో ఇన్నింగ్స్‌కు బలమైన పునాదిని వేసుకుంది. చకచకా బౌండరీలు బాదిన షెఫాలి.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. 26 బంతుల్లోనే అర్ధసెంచరీ చేసింది. టీ20 కెరీర్‌లో ఆమెకు ఇది 19వ అర్ధశతకం. అలవోకగా షాట్లు ఆడిన షెఫాలి.. స్మృతి మంధాన (19; 10 బంతుల్లో 4x4)తో తొలి వికెట్‌కు 38, ప్రతీక రావల్ (22; 18 బంతుల్లో 2ఐ4, 1ఐ6) రెండో వికెట్‌కు 53 పరుగులు జోడించింది. స్మృతి (19; 10 బంతుల్లో 4x4) ధాటిగానే ఆరంభించినప్పటికీ ఎక్కువ సేపు నిలవలేకపోయింది. ప్రతీక రావల్ (22; 18 బంతుల్లో 2ఐ4, 1x6) కూడా తన ఆరంభాన్ని పెద్ద స్కోరుగా మలచలేకపోయింది. అయినా షెఫాలి జోరుతో 10 ఓవర్లలో 101/2తో నిలిచిన భారత్.. అలవోకగా 200 చేసేలా కనిపించింది. కానీ అనూహ్యంగా తడబడింది. నాలుగు పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయింది. హర్మన్‌ప్రీత్ (5), షెఫాలి, రిచా (0) ఔటయ్యారు. హర్మన్‌ప్రీత్‌ను పుతవాంగ్ వెనక్కి పంపగా.. షెఫాలి, రిచాలను లవోమి వరుస బంతుల్లో ఔట్ చేసింది. ఆ తర్వాత కూడా క్రమం తప్పకుండా వికెట్లు పడ్డాయి. దీప్తి శర్మ (5) కూడా విఫలమైంది. ఆఖర్లో క్రాంతి గౌడ్ (15 నాటౌట్; 8 బంతుల్లో 1x4, 1x6) బ్యాట్ ఝుళిపించడంతో స్కోరు 150 దాటింది. భారత జట్టు ఆఖరి 9 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 52 పరుగులు మాత్రమే చేసింది. థాయ్ స్పిన్నర్లు లవోమి (3/26), సునిద (2/31) భారత్‌ను దెబ్బతీశారు.

చేతులెత్తేసిన థాయ్‌లాండ్: ఛేదనలో థాయ్‌లాండ్ చేతులెత్తేసింది. భారత బౌలర్ల ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన ఆ జట్టు.. ఏ దశలోనూ పోటీలో లేదు. నతకన్ (4)ను ఔట్ చేయడం ద్వారా థాయ్‌ని తొలి ఓవర్లోనే క్రాంతి దెబ్బతీసింది. ఆ తర్వాత నందని, శ్రీచరణి, దీప్తి శర్మ, నందని శర్మ చకచకా వికెట్లు పడగొట్టి త్వరగా మ్యాచ్‌ను ముగించారు. ఓ వైపు వికెట్లు పోతున్నా, ననపత్ పోరాడింది. ఆమె వల్లే థాయ్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. ననపత్ చివరి వికెట్ రూపంలో నిష్క్రమించింది.

# జర్మనీ నాలుగోసారి హాకీ ప్రపంచకప్ కైవసం

## ఫైనల్లో స్పెయిన్‌పై విజయం



**బెల్జియం:** పురుషుల హాకీ ప్రపంచకప్‌ను జర్మనీ నిలబెట్టుకుంది. ఆదివారం ఉత్కంఠభరిత ఫైనల్లో ఆ జట్టు 1-0తో స్పెయిన్‌పై విజయాన్నందుకుంది. ఈ గెలుపుతో అత్యధిక టైటిళ్లు (4) సాధించిన దేశంగా పాకిస్థాన్‌తో సమంగా నిలిచింది. తుదిపోరులో రెండు జట్లూ నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. ముఖ్యంగా ఇరు దేశాల రక్షణశ్రేణి ఆకట్టుకుంది. తొలి పది నిమిషాల్లోనే జర్మనీ, స్పెయిన్‌లకు పెనాల్టీ కార్నర్‌లు దక్కినప్పటికీ సద్వినియోగం చేసుకోలేకపోయాయి. దీంతో మ్యాచ్ సగం అయ్యేసరికి ఏ జట్టూ గోల్స్ ఖాతా తెరవలేకపోయింది. మూడో క్వార్టర్‌లో స్పెయిన్ దాదాపు పదిసార్లు జర్మనీ గోల్‌పోస్టుపై దాడులు జరిపినప్పటికీ ఫలించలేదు. 44వ నిమిషంలో మైకెల్ స్ట్రూతాఫ్ బంతిని నెట్‌లోకి పంపించి జర్మనీని ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. తర్వాత కూడా స్కోరు సమం చేసేందుకు స్పెయిన్ దూకుడు పెంచింది. కానీ జర్మనీ డిఫెన్స్ ముందు ఆ జట్టు ప్రయత్నాలు సఫలం కాలేదు. అంతకుముందు రసవత్తరంగా సాగిన మూడో స్థానం మ్యాచ్‌లో అర్జెంటీనా 2-1తో ఆతిథ్య నెదర్లాండ్స్‌ను ఓడించింది. మొదట డోమీన్ (41) అర్జెంటీనా ఖాతా తెరవగా.. ఫ్లోరిస్ (49) స్కోరు సమం చేశాడు. ఆరో ప్రపంచకప్ ఆడుతున్న మతియాస్ రే (59వ) గోల్ కొట్టి అర్జెంటీనాకు విజయాన్నందించాడు.

# వైభవ్ కెప్టెన్‌గా దులీప్ ట్రోఫీ





బెంగళూరుఐపీఎల్‌లో మెరుపులతో 15 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్లో అరంగేట్రం చేసి సంచలనం సృష్టించిన వైభవ్ సూర్యవంశీ.. అదే వయసులో ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో కెప్టెన్ అయిపోయాడు. దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో ఈస్ట్ జోన్‌కు అడుతున్న అతడు.. ఆదివారం తొలి రోజు ఆటలో అనుకోకుండా కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. రెగ్యులర్ కెప్టెన్ ఇషాన్ కిషన్ వేలికి గాయమై, 19వ ఓవర్లో మైదానాన్ని వీడటంతో.. వైభవ్ తాత్కాలిక సారథి అయ్యాడు. అతను డీఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేయడం ద్వారా కెప్టెన్‌గా తన ముద్రను చూపించాడు. సెంట్రల్ జోన్ ఇన్నింగ్స్‌లో ఆర్యన్ జుయల్ (46) స్ట్రైకింగ్‌లో ఉండగా.. బంతి అతడి బ్యాట్‌కు దగ్గరగా వెళ్లింది. అప్పీల్ చేయగా అంపైర్ ఔట్ ఇవ్వలేదు. వైభవ్ సమీక్ష కోరగా.. బంతి బ్యాట్‌ను తాకినట్లు డీఆర్‌ఎస్‌లో చూపించడంతో సూర్యవంశీ సంబరాలు చేసుకున్నాడు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఈస్ట్.. సెంట్రల్ జోన్‌ను 80.1 ఓవర్లలో 266 పరుగులకే ఆలౌట్ చేసింది. ముకేశ్ కుమార్ (3/56), అభిజిత్ సర్కార్ (3/38) ధాటికి సెంట్రల్ 100లోపే నాలుగు వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. కెప్టెన్ రజత్ పాటీదార్ (12) తక్కువకే పెవిలియన్ చేరాడు. ఈ దశలో వైస్‌కెప్టెన్ రింకు సింగ్ (60) జట్టును ఆదుకున్నాడు. ఆఖర్లో యశ్ ఠాకూర్ (30 నాటౌట్) బ్యాట్ ఝుళిపించడంతో సెంట్రల్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. మహ్మద్ షమి, మహ్మద్ ఖురేషి చెరో రెండు వికెట్లు తీశారు. ఈస్ట్ రెండో రోజు బ్యాటింగ్‌కు రానుంది. సౌత్ 40/2.. క్రీజులో తిలక్: మరో సెమీస్‌లో తిలక్ వర్మ నేతృత్వంలోని సౌత్ జోన్ సత్తాచాటింది. విద్వత్ కావేరప్ప (4/66) విజృంభించడంతో తొలి ఇన్నింగ్స్‌లో నార్త్ జోన్‌ను 195 పరుగులకే కుప్పకూల్చింది. నార్త్ ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్ (76) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. అతడు కాకుండా కన్హయ్య వధవాన్ (35) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు. ఒక దశలో 161/4తో ఉన్న నార్త్.. కనీసం 250 దాటుతుందనిపించింది. కానీ సౌత్ బౌలర్లు చెలరేగిపోయారు. 34 పరుగుల వ్యవధిలో చివరి 6 వికెట్లు తీసి, నార్త్‌ను 200లోపే చుట్టేశారు. హైదరాబాద్ స్పిన్ ఆల్‌రౌండర్ తనయ్ త్యాగరాజన్ (2/31) కీలక వికెట్లు పడగొట్టగా.. ఆంధ్ర బౌలర్ కావురి సాయితేజ ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ తొలి రోజు ఆట ముగిసేసరికి 40/2తో నిలిచింది. తిలక్ (1), నారాయణ్ జగదీశన్ (34) క్రీజులో ఉన్నారు. ఆంధ్ర ఆటగాళ్లు రికీ భుయ్ (5), షేక్ రషీద్ (0) నిరాశపరిచారు. అన్షుల్ కంబోజ్, గుర్నూర్ బ్రార్ చెరో వికెట్ తీశారు.

# పాక్‌కు మళ్లీ పరాభవం

## టెస్టు సిరీస్ ఇంగ్లాండ్ సొంతం

**లార్డ్స్:** ఇంగ్లాండ్ పర్యటనలో పాకిస్థాన్‌కు మరో పరాభవం తప్పలేదు. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఘనవిజయం సాధించిన ఇంగ్లిష్ జట్టు మూడు టెస్టుల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే చేజిక్కించుకుంది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ ఓటమి చవిచూసిన పాక్.. రెండో మ్యాచ్‌లో 194 పరుగుల తేడాతో చిత్తయింది. 389 పరుగుల భారీ లక్ష్యంతో నాలుగో రోజు బరిలోకి దిగిన పాకిస్థాన్.. ఓలీ రాబిన్సన్ (4/24), జోష్ టంగ్ (3/46), జోఫ్రా ఆర్చర్ (2/73)ల ధాటికి 50.5 ఓవర్లలో 194 పరుగులకే ఆలౌటైంది. సౌద్ షకీల్ (97; 122 బంతుల్లో 13ఐ4, 2ఐ6) పోరాడకుంటే ఇంకా ఘోరంగా ఓడేది. అంతకుముందు 177/7తో ఆదివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లాండ్.. 208 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 290 పరుగులు చేయగా.. పాక్ 110కే కుప్పకూలింది. గాయంతో తొలి టెస్టుకు దూరమైన కెప్టెన్ బాబర్ అజామ్.. ఈ మ్యాచ్‌లో ఆడినా, జట్టుకు ఓటమిని తప్పించలేక పోయాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా అతను 8, 6 పరుగులే చేశాడు. మూడో టెస్టు సెప్టెంబరు 9న బర్మింగ్‌హామ్‌లో మొదలవుతుంది.




వేగుచుక్క




# నాగార్జున వందో సినిమా


## కింగ్ 100 గ్లింప్స్ విడుదల

అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ఫ్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్-టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్లు గ్లింప్స్ తో తెలియజేశారు.










# ప్యారడైజ్ నుంచి యెష నాగుల కట్టమీద పాట విడుదల

నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను అందించారు. ఈ చిత్రం నుంచి రెండో సింగిల్‌గా మోస్ట్ పాపులర్ ఫోక్ సాంగ్ అయిన 'యెష నాగుల కట్ట మీద' పాటను డిజిటల్ వేదికగా విడుదల చేశారు. తెలంగాణ నేటివిటీని ప్రతిబింబించేలా సాగే ఈ జానపద గీతాన్ని సినిమాలో మరింత మాస్ వైబ్‌తో రీమిక్స్ వెర్షన్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సోషల్ మీడియాలోనూ, ప్రజల నోళ్లలోనూ నానుతున్న ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన రాకింగ్ మాస్ బీట్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. 'దసరా' బ్లాక్‌బస్టర్ తర్వాత నానితో పాటు తెరపై ఈ పాటకు రాబోయే మాస్ స్టెప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చుతున్నాయి. ఈ క్యాచీ సాంగ్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించగా, జంగి రెడ్డి మరియు సింగర్ ప్రభ తమ శక్తివంతమైన గాత్రంతో ప్రాణం పోశారు. ఎస్.ఎల్.వి. సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మహేంద్రగిరి వారాహి ట్రైలర్ విడుదల







టాలీవుడ్ నటుడు సుమంత్ హీరోగా, సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం చిత్రబృందం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇక రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కలిపు మధు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. పరమశివుడి ఆజ్ఞతో మహేంద్రగిరిలో కొలువుదీరిన గ్రామదేవత 'వారాహి మాత' నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. మహేంద్రగిరి రాజకుటుంబానికి చెందిన వారు గత 150 ఏళ్లుగా అనుమానాస్పద స్థితిలో వరుసగా మరణిస్తుండటం, ఇదంతా అమ్మవారి శాపం వల్లే జరుగుతోందనే నమ్మకం చుట్టూ ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఆ రహస్యాన్ని ఛేదించేందుకు హీరో సాహసించే తీరు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వారాహి మాతగా నటి ఐశ్వర్య రాజేష్ అలరించనుండగా, 'స్టార్ బాయ్' సిద్ధు జొన్నలగడ్డ ఒక కీలక పాత్రలో ట్రైలర్‌లో సర్ ప్రైజ్ ఎంట్రీ ఇచ్చి అంచనాలను అమాంతం పెంచేశారు. వీరితో పాటు మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. వారాహికి ఎదురెళ్లి ఈ శాపాన్ని తప్పిస్తాను' అంటున్నారు సుమంత్. మహేంద్రగిరి రాజ వంశస్థులకు వారాహి అమ్మవారి శాపం ఎలా తగిలింది? అందుకు కారణం ఏంటి? మరి అన్నట్లుగానే ఆ శాపం ఏంటో కథానాయకుడు కనుగొన్నాడా? శాప విమోచనకు ఏం చేశాడు? అన్నది తెలియాలంటే 'మహేంద్రగిరి వారాహి' చూడాల్సిందే. సుమంత్ హీరోగా దర్శకుడు సంతోశ్ జాగర్లపూడి తెరకెక్కించిన సోషియో ఫాంటసీ చిత్రమిది. ఐశ్వర్య రాజేశ్, మాళవికా నాయర్, తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీ సెప్టెంబరు 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదలైంది. ఆద్యంతం థ్రిల్ పంచేలా మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.




# బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్

ప్రస్తుతం సమంత తల్లికాబోతున్న ఆనందంలో ఉన్నారు. ఒకవైపు బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్.. మరోవైపు వ్యాయామం చేస్తూ అభిమానులతో ఫొటోలు పంచుకుంటున్నారు. తాజాగా ఇన్‌స్టా వేదికగా ఫ్యాన్స్‌తో ముచ్చటించారు. కొందరు తల్లులు ఆమెకు సలహాలు ఇవ్వగా.. మరికొందరు ఆమెతో వారి అనుభవాలు పంచుకున్నారు. బేబీ కోసం కావాల్సిన వస్తువులన్నీ కొన్నాను. వాటిని చూస్తుంటే కాస్త కంగారుగా ఉంది. అందుకే ప్రస్తుతానికి వాటిని ప్యాక్ చేసి ఆ బ్యాగ్‌ను ఒక లాప్‌టాప్ స్టాండ్‌గా వాడుతున్నానన్నారు. ప్రెగ్నెన్సీతో ఉన్నప్పటి నుంచి నాకు కలలు వస్తున్నాయి. మీకు కూడా వస్తున్నాయా అంటూ ప్రశ్నలు వేస్తున్నారు. నిజంగానే.. ఈ విచిత్రమైన కలల గోల ఏంటో అర్థం కావట్లేదు.

మరోవైపు11 కేజీలు పెరిగాననన్నారు. కొత్తగా తల్లి అయిన తర్వాత చాలా మార్పులు వస్తాయట.

నేను ఆ క్షణాల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. పుట్టినవారికి పాలు పట్టడం, జోలపాడి నిద్రపోయేలా చేయడం.. ఈ పనులు ఫుల్ టైమ్ జాబ్‌లా మారిపోతాయి. అది చాలా అందమైన, గొప్ప అనుభూతి. జీవితాన్ని మార్చే అనుభవం. మాతృత్వం ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుంది. మాతృత్వం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఇప్పటి వరకు తెలియదు. నేను ఊహించలేదు కూడా. మంచి విషయాన్ని తెలిపారు. ధన్యవాదాలు అంటున్నారు. పుట్టబోయే బిడ్డకు ఏం పేరు పెడతారంటే ..ఓ పేరును ఎంచుకోవడం చాలా కష్టం.. దీనికి మీ అందరి సహాయం కావాలి. స్కానింగ్ రిపోర్ట్స్ వచ్చేదాక చాలా టెన్షన్‌గా ఉంటుంది. అయితే ఈ కొత్త దశను పూర్తిగా ఆస్వాదిస్తున్నానని సమంత ఆనందంగా చెప్పారు.

# ఇరుముడి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్‌కు రెడీ




మాస్ మహారాజా రవితేజ హీరోగా, ప్రతిభావంతుడైన దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన హార్ట్ టచింగ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి' . ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యున్నత ప్రమాణాలతో నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చి అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. మొదటి రోజు నుంచే అద్భుతమైన పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతోంది. రవితేజ కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా నిలిచిన 'ఇరుముడి', భావోద్వేగాలతో కూడిన కంటెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తూ ఘన విజయంతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. పాన్-ఇండియా స్థాయిలో విడుదలైన యశ్ 'టాక్సిక్' వంటి భారీ బ్జడెట్ చిత్రం బరిలోకి దిగినప్పటికీ, 'ఇరుముడి' క్రేజ్ ఏమాత్రం తగ్గకపోవడం విశేషం. ఆ పోటీని సైతం తట్టుకుని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ హౌస్‌ఫుల్ బోర్డులతో స్టాం÷-రగ్ కలెక్షన్లను రాబడుతోంది. రవితేజ మార్క్ ఎనర్జీతో పాటు త్రినాథ్ పాత్రలో ఆయన పండించిన ఎమోషన్స్, శివ నిర్వాణ టేకింగ్, జీవీ ప్రకాశ్ సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. థియేటర్లలో ఇంకా కలెక్షన్ల సునామీ కొనసాగుతున్న తరుణంలోనే, ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించిన ఆసక్తికరమైన సమాచారం బయటకు వచ్చింది. ÷ూజా సమాచారం ప్రకారం, ప్రముఖ దిగ్గజ ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్ 'నెట్‌ఫ్లిక్స్' ఈ చిత్ర డిజిటల్ రైట్స్‌ను భారీ ఫ్యాన్సీ ధరకు దక్కించుకుంది. థియేట్రికల్ రన్ ముగిసే సమయానికి, అంటే సెప్టెంబర్ 18 నుంచి 'ఇరుముడి' చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్‌లో అధికారికంగా స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. సినిమా విడుదలైన నాలుగు వారాల విండో తర్వాత తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది.